# గొలుసుకథ



జగన్నాథసూరిగారు ఆజిల్లాలో పేరు మోసిన క్రిమినల్ లాయరు.

'లా'లో ఎంత దిట్టో, డబ్బు విషయంలో అంత ఖచ్చితపు మనిషి.

పార్టీల దగ్గర ఆయన ముందే చెప్పారు. తను అడిగిన ఫీజులో సగం ముందే యివ్వాలని, మిగిలిన సగం ఆర్గ్యుమెంట్సు రోజున యివ్వాలని. తను తరువాత అక్షరం తేడా వచ్చినా వొప్పేది లేదని మనవి చేసుకుంటారు.

జగన్నాథసూరిగారు ఆ రోజు పదకొండు గంటలకి సెషన్సు కోర్టులో ఓ డెకాయిట్ కేసులో ఆర్గ్యుమెంట్సు చెప్పవలసి వున్నది. తన ఆఫీసు రూములో ఆర్గ్యుమెంట్సుకి ప్రిపేర్ అవుతూ పార్టీ కోసం ఎదురు చూస్తూ వున్నారు.

డెకాయిట్‌లో మొదటి ముద్దాయి ఆ గ్రూపుకి లీడరు అయిన చంద్రం వచ్చి నమస్కరించాడు, ప్లీడరుగారిక్కి.

"తే! తే! టైము లేదు మరి" ప్లీడరుగారు తొందరపడ్డారు.

చంద్రం మళ్ళీ నమస్కరించాడు.

"కృష్ణార్పణం. దండం దశగుణం. నా వద్ద ధనం దశగుణం అని రూపాంతరం చెందుతుంది. డబ్బు తెచ్చావా? తెస్తే యిక్కడ ఇలా యీ టేబుల్ మీద వెయ్యి. నాకు దణ్ణం పెట్టకపోయినా ఫర్వాలేదు. నాకవతల బోల్డు పనులున్నాయ్—గాయత్రీ స్తోత్రం అంటే మాటలా!" గబగబా అన్నారు. "సార్! ఎంతో ప్రయత్నించాను. వీలుకాలేదు. మా వాళ్ళని నలుగురిని నాలుగు దిక్కులకి పంపించాను. ఈ రోజు కాకపోయినా రేపైనా మీ డబ్బుని పువ్వు...."

"పువ్వులు లేదు నా పిండాకూడూ లేదు. ఇదిగో! నా దగ్గర యీ నానుడు బేరాలు కూడదని ముందే చెప్పాను. మీ వంటి వాళ్ళని ఎందరిని చూస్తే నా తల ఇలా పండిందంటావ్? వెళ్ళు! వెళ్ళు! వెళ్ళి పదకొండు గంటలకి కోర్టు దగ్గరికి ఆ ఐదు వందలూ తెచ్చి నా చేతిలోపోశావా నేనే వెళ్ళి ఆర్గ్యుమెంట్సు చెప్తా! లేదంటావా? నా జూనియర్‌కు అప్పగించి నే కూర్చుంటా! కుర్రకుంక ఒక్క దావికైనా ఆర్గ్యుమెంట్సు చెప్పాలని మహా వుబలాటపడుతున్నాడు" అని పంచెని యెగదోసుకొంటూ లోనికి వెళ్ళిపోయారు ప్లీడరుగారు.

చంద్రం తల గోక్కుంటూ వరండాలోకి వచ్చాడు. బయట ప్లీడరుగారి మనవరాలు యిసుకని పోగేసుకొని గూడుకట్టుకొంటోంది. ఆ పిల్లని చూసి చంద్రం దగ్గరకి వెళ్ళి "పాపా!" అని పిల్చాడు.

"ఏం?" అని పని ఆపి చూసింది.

"నీ పేరేమిటమ్మా" పాప ముందు గొంతు కూర్చుంటూ అడిగాడు.

"ఎన్నిసార్లు చెప్పాలి? ఓసారి చెప్పాగా! నా పేరు హేమమాలిని. మా డాడీకి హేమమాలిని అంటే యిష్టం అట. అందుకే నాకాపేరు పెట్టారట" అని కళ్ళు త్రిప్పుతూ అంది.

"అబ్బో! అబ్బో! నీవు అచ్చు హేమమాలిని మాదిరిగానే వున్నావ్" అని ఎత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు.

ఛీ....ఎంగిలి! మా బామ్మ చూస్తే చంపి పారేస్తుంది" అని ఆరిందలా అనింది.

## సూరిశెట్టి కృష్ణవేణి

పాపని చంద్రం క్రిందికి దించి వెళ్ళిపోయాడు.

* * *

కారులో వచ్చిన ప్లీడరుగారికి చంద్రం నమస్కరించి కారు డోర్ తనే తెరిచాడు.

ఆయన ప్రశ్నార్థకంగా చూడక ముందే ఆయన ముందుకి తన చెయ్యిని చాపి డబ్బు యిచ్చాడు.

లెక్క పెట్టుకొన్నారు.

ఆరు వందలు. అంటే వంద ఎక్కువ అన్నమాట.

ప్లీడరుగారి మొఖం వికసించింది.

ఆ రోజు ఆయన ఆర్గ్యుమెంట్సుని బ్రహ్మాండంగా చెప్పారు.

ఎంత బాగా చెప్పారంటే, వారి ఆర్గ్యుమెంట్సు విని "ఆర్గ్యుమెంట్సు హైకోర్టు జడ్జిమెంటు రిజర్వుడ్ అని జడ్జిగారు అనకుండా యింకో గంటకంతా జడ్జిమెంటుని డెలివరీ చేసేశారు.

చంద్రం తదితరులు విడుదలయ్యారు.

* * *

బిలబిల్లా.... తననా.... న్నా.... బుర్రాడించుకొంటూ హుషార్‌గా ప్లీడరుగారు యింట్లోకి అడుగు పెట్టగానే ఆయన భార్య గొల్లుమంది.

"చంటిముండ మెళ్లో గొలుసు పోయిందండోయ్" అంటూ.

అది యెవరి పనో క్రిమినల్ బుర్రకి తెలిసిపోయింది. ఆయన నోటిలోనుంచి "హరి పిడుగా!" అని మాత్రం వచ్చింది.

## గాడిద

మాసిన బట్టల బరువుల్ని
    మోసి వచ్చిన గాడిద
తల వేలాడేసుకుని
తనే ఒక మూటలా
చతికిలపడి కూచుంది,
జగతిలో దుఃఖాలన్నీ
మూట కట్టినట్టుంది.
మూట కట్టిన దుప్పటీ అంచుల్లా
ముందు కొచ్చిన చెవులు
భూమి గాడిదని మోస్తుందో
గాడిదే భూమి భారాన్ని మోస్తుందో
తెలీకండా ఉంది.

—ఇస్మాయిల్